

జైలు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. పాపిరెడ్డి

మంచి అలవాట్లు పెంపొందించుకోండి

ఖైదీల సంక్షేమ దినోత్సవంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. పాపిరెడ్డి

పాలమూరు, న్యూస్‌టుడే : జైలు జీవితంలో మంచి అలవాట్లను పెంపొందించుకోవాలని, కారాగారం నుంచి విడుదలై ఇంటికి వెళ్లిన తర్వాత కుటుంబ సభ్యులు, ఇతరులతో ఆనందంగా గడపడానికి కావాల్సిన నైపుణ్యాలను పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన కారాగారంలో గాంధీ జయంతిని పురస్కరించుకుని ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. పుట్టుకతోనే ఎవరూ నేరస్థులు కారని, పరిస్థితుల ప్రభావంతో క్షణికావేశంలో చాలామంది నేరస్థులుగా మారుతున్నారని పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మాగాంధీ అనేక సార్లు జైలుకు వెళ్లి వచ్చారని, ఖైదీలకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని ఆయన కోరేవారని పేర్కొన్నారు. అందువల్లనే గాంధీ జయంతిని ఖైదీల సంక్షేమ దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జైలులో ఖైదీలకు పునరావాసంతో పాటు వృత్తి శిక్షణ ఇస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి. జానకి మాట్లాడుతూ జైలు జీవితం దిద్దుబాటుకు అవకాశమని పేర్కొన్నారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన ఖైదీలకు బహుమతులు అందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అదనపు కలెక్టర్ మోహన్‌రావు, జడ్జి కళ్యాణ చక్రవర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి ఇందిర, జైలు సూపరింటెండెంట్ వెంకటేశం పాల్గొన్నారు.

కొండలు.. గుట్టలు.. మాయం!

అభివృద్ధి పేరుతో యథేచ్ఛగా తవ్వకాలు

ఈనాడు, మహబూబ్‌నగర్ - న్యూస్‌టుడే, ధరూర్: పాలమూరులో జాతీయ రహదారుల నిర్మాణం మాటున ప్రకృతి సంపద మాయం అవుతోంది. ఆయా జిల్లాల్లో రోడ్ల నిర్మాణం జరిగే పరిసర ప్రాంతాల్లో కొండలు, మట్టి గుట్టలు ఆనవాళ్లు లేకుండాపోతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతున్నారు. మొరం, క్వారీ తవ్వకాలకు తహసీల్దార్ నుంచి ఎన్‌వోసీ తీసుకుని ఆ లేఖను గనులశాఖకు ఇవ్వాలి. సర్వేయర్ వచ్చి అక్కడ మైనింగ్‌కి అవకాశం ఉందా? లేదా? ఎంత మేర తవ్వాలి? ఎంత మేర తరలించాలి? సీనరేజీ ఛార్జీలు ఎంత చెల్లించాలి? వంటివి పరిశీలించి అనుమతులిస్తారు. ఉమ్మడి జిల్లాలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపి రూ.కోట్లలో సీనరేజి ఛార్జీల్లోనూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎన్‌హెచ్150సి: గద్వాల జిల్లా నందిన్నె నుంచి ఏపీలోని నంద్యాల వరకు (77 కిలోమీటర్లు)
మొత్తం విలువ: రూ.1,568 కోట్లు
మట్టి పని విలువ: సుమారు రూ.470 కోట్లు



శాంతినగర్‌లో మొరం కోసం ఇలా..

జరిమానా విధించినా.. : ● మొరం టన్నుకు రూ.35, రాళ్లకు టన్నుకు రూ.80 వరకు సీనరేజీ ఛార్జీలు మైనింగ్ శాఖకు చెల్లించాలి. గతేడాది గద్వాల జిల్లాలో అక్రమ తవ్వకాలు జరిపినందుకు గనులశాఖ జరిమానా విధించింది. ప్రభుత్వానికి రూ.4.95 కోట్లు సీనరేజీ ఛార్జీలు, రూ.1.48కోట్లు జిల్లా మినరల్ ఫండ్, రాష్ట్ర మినరల్ ఫండ్ రూ.9.90 లక్షలు, ఆదాయం పన్ను రూ.9 లక్షలు చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. అయినా గుత్తేదారు సంస్థ స్పందించకపోవడంతో 10 రెట్ల జరిమానాతో రూ.52 కోట్లు చెల్లించాలని డిమాండ్ నోటీసులు అందించారు. తాజాగా గట్టు మండలంలో నిబంధనలకు విరుద్ధంగా తవ్వుతున్న పలుగురాళ్లపై రూ.4 కోట్ల వరకు జరిమానా విధించింది.

● మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని జాతీయ రహదారి పేరుతో హన్వాడ, మహ్మదాబాద్, గండీడ్‌లో మొరం మట్టి, కంకర కోసం పెద్ద ఎత్తున గుట్టల్ని ధ్వంసం చేస్తున్నారు. గుట్టల వద్ద శిబిరాలు ఏర్పాటు చేసుకుని మరీ తవ్వుతున్నారు. జిల్లాలో మైనింగ్ శాఖ ఎలాంటి తనిఖీలు లేకపోవడంతో యథేచ్ఛగా సంపదను కొల్లగొట్టేస్తున్నారు. సీనరేజీ ఛార్జీలు నేరుగా తమ ఖాతాలో జమవుతున్నాయని జిల్లా అధికారులు పట్టించుకోపోవడంతో సుమారు రూ.10 కోట్ల విలువైన మొరం, కంకర, పలుగురాళ్ల వ్యాపారం చేపట్టినట్లు సమాచారం.

ఎన్‌హెచ్-167ఎన్: మహబూబ్‌నగర్-చించోళి వరకు (60 కిలోమీటర్లు)
మొత్తం విలువ: రూ.703.68 కోట్లు
మట్టి పని విలువ: సుమారు రూ.211 కోట్లు



గండీడ్ మండలం గోవింద్‌పల్లిలో తవ్వకాలు



ఊర్కొండపేటలో కరుగుతున్న గుట్ట

గ్రామాలకు అందని డబ్బు..: సీనరేజీ ఛార్జీల రూపంలో ప్రభుత్వ ఖజానాకు వచ్చిన నిధుల్లో 25 శాతం గ్రామ పంచాయతీలకు, మండల, జిల్లా పరిషత్తులకు 50 శాతం కేటాయించాలని కేంద్ర నిబంధనలు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఇది ఎక్కడా అమలు కావడం లేదు. ఉమ్మడి జిల్లాలో మూడు జాతీయ ప్రాజెక్టులకు కలిపి సుమారు రూ.150 కోట్ల వరకు సీనరేజీ ఛార్జీల రూపంలో చెల్లించాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కటే ఖాతా ఉండటంతో అన్నీ అందులోనే జమవుతున్నాయి. అసలు సీనరేజీ ఛార్జీలు వస్తున్నాయో? లేదో? కూడా గనులశాఖకు అవగాహన ఉండడం లేదు. దీనిపై మహబూబ్‌నగర్, గద్వాల జిల్లాల మైనింగ్ శాఖ అధికారులు 'ఈనాడు'తో మాట్లాడుతూ అనుమతులున్న చోటే తవ్వకాలు జరపాలని చెప్పారు. ఇష్టారాజ్యంగా తవ్వితే జరిమానా విధిస్తామన్నారు. జాతీయ రహదారి డీఈ రమేశ్ మాట్లాడుతూ రహదారుల పనుల్లో మొరం, కంకర కోసం అనుమతులు తీసుకుంటామని, వాటి డబ్బు నేరుగా మైనింగ్ శాఖకు చెల్లిస్తామని చెప్పారు. గద్వాల జిల్లా పంచాయతీ అధికారి శ్యాంసుందర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు రూపాయి కూడా సీనరేజీ ఛార్జీల రూపంలో గ్రామాలకు రాలేదన్నారు.

ఎన్‌హెచ్-167కే: కల్వకుర్తి - కొల్లాపూర్ వరకు (77 కిలోమీటర్లు)
మొత్తం విలువ: రూ.886.69
మట్టి పని విలువ: సుమారు రూ.266 కోట్లు

● నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొంపేట వద్ద ఓ గుట్టను కొల్లగొడుతున్నారు. జాతీయ రహదారి పనుల పేరుతో ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాల అవసరాలకు మట్టిని తరలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లాలోని పలు చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. సుమారు రూ.5 కోట్ల విలువైన వ్యాపారం మైనింగ్ పేరుతో జరిగినట్లు అంచనా.

జాతిపిత స్ఫూర్తితో ముందుకెళ్దాం : కలెక్టర్



మహాత్మా గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి, అధికారులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : గాంధీజీ సత్యం, అహింస సిద్ధాంతాలుగా, సత్యాగ్రహం ఆయుధంగా ఆంగ్లేయులను ఎదురించి దేశానికి స్వాతంత్రం తెచ్చిపెట్టారని, ఆయన స్ఫూర్తితో ముందుకెళ్దామని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బుధవారం మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మహాత్ముడు చూపిన మార్గంలో ప్రయాణించి దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఎస్. మోహన్‌రావు, డీఆర్‌డీవో నరసింహులు, డీపీవో పార్థసారథి, డీపీఆర్వో శ్రీనివాస్, చేనేత, జౌళీశాఖ ఏడీ బాలు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో సేవలందించాలి : డీఐజీ



మహాత్మాగాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ డి.జానకి తదితరులు

మహబూబ్‌నగర్ నేరవిభాగం : పోలీసులు ప్రజలకు నిబద్ధతతో సేవలందించాలని జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ సూచించారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జోగులాంబ జోన్ డీఐజీ కార్యాలయం వద్ద మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ గాంధీజీ సత్యం, అహింసా అనే రెండు ప్రధాన సూత్రాలతో జీవనం సాగించారని గుర్తుచేశారు. గాంధీజీ స్ఫూర్తితో పోలీస్ వ్యవస్థలో విలువలు పాటించాలన్నారు. నిత్యం అనేక మంది బాధితులు ఠాణాలకు వస్తున్నారని, వారితో మర్యాదగా మాట్లాడి సమస్యల పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.జానకి, అదనపు ఎస్పీ రాములు, ఏఆర్ ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, వెంకటరమణారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా డిజిటల్ కార్డు సర్వే

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఒక డిజిటల్ కార్డు ఇవ్వనున్న నేపథ్యంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అర్బన్ వార్డు, ఒక గ్రామ పంచాయతీని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి సర్వే బృందాలను నియమించామని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్‌లో సర్వే బృందాలకు ఏర్పాటు చేసిన శిక్షణలో మాట్లాడారు. ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకు సర్వే నిర్వహించి కుటుంబాల సర్వే నిర్వహించి వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో హన్వాడ మండలంలోని మాదారం గ్రామం, పురపాలికలోని 37వ వార్డును, జడ్చర్ల నియోజకవర్గంలోని అల్వాన్‌పల్లి గ్రామం, పురపాలిక పరిధిలోని 24వ వార్డు, దేవరకద్ర నియోజకవర్గంలోని సీసీకుంట మండలం సీతారాంపేట పంచాయతీ, భూత్పూరు పురపాలికలోని 9వ వార్డును పైలట్‌గా ఎంపిక చేసినట్లు వివరించారు. సర్వే బృందాల్లో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పుర కమిషనర్లతో పాటు పంచాయతీ రాజ్, రెవెన్యూ, పుర సిబ్బందిని నియమించామన్నారు. అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఎస్. మోహన్‌రావు, భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్ రామిరెడ్డి, డీపీవో పార్థసారథి, ఆర్డీవో నవీన్ పాల్గొన్నారు.

ధ్రువపత్రాల పరిశీలనకు 114 మంది హాజరు

నేటి నుంచి స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకూ ప్రారంభం



డైట్ కళాశాలలో అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న డీఈవో రవీందర్, అధికారులు

పాలమూరు, న్యూస్‌టుడే : డీఎస్సీ - 2024లో మెరుగైన మార్కులు సాధించి 1:3 నిష్పత్తిలో ఎంపిక చేసిన మెరిట్ జాబితాలో చోటు సంపాదించిన అభ్యర్థులు తమ ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకునేందుకు జిల్లా కేంద్రానికి వస్తున్నారు. బుధవారం మెట్టుగడ్డలో ఉన్న డైట్ కళాశాలలో ఎస్జీటీ విభాగం అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ప్రారంభించారు. జిల్లాలో డీఎస్సీ-2024లో భర్తీ చేసే 243 పోస్టుల్లో 121 ఎస్జీటీకి చెందినవే ఉన్నాయి. అందుకోసం 1:3 నిష్పత్తిలో ఎంపికైన 363 మంది అభ్యర్థుల జాబితా బుధవారం ఉదయం విద్యాశాఖ అధికారులకు అందింది. అంతకు ముందే ఎస్జీటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల మెయిల్ ఐడీకి, వారి చరవాణికి సందేశం వచ్చింది. ఈ నెల 5 వరకు వారి ధ్రువ పత్రాలను పరిశీలన చేయించుకోవడానికి గడువు ఉంది. తొలిరోజు 114 మంది ఎస్జీటీ అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకోవడానికి వచ్చారు. డైట్ కళాశాలలోని పరిశీలన కేంద్రాలకు అభ్యర్థులు వెళ్లే దారిలో విరిగిన బెంచీలు ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఆరు కేంద్రాల్లో ప్రక్రియ షురూ.. : అన్ని ఉపాధ్యాయ పోస్టుల అభ్యర్థుల మెరిట్ జాబితాలు ఒకేసారి వస్తే ధ్రువపత్రాలను పరిశీలించేందుకు 12 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రంలో ఇద్దరు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఒకరు జూనియర్ అసిస్టెంట్ ఉన్నారు. రోజూ ఆ కేంద్రానికి వచ్చిన అభ్యర్థుల రెండు సెట్ల ధ్రువపత్రాలు స్వీకరించిన తర్వాత వివరాలను అంతర్జాలం ద్వారా రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులకు(డీఎస్ఈ) పంపించాలి. బుధవారం ఉదయం స్కూల్ అసిస్టెంట్, ఇతర విభాగాల మెరిట్ జాబితాలు డీఈవో కార్యాలయానికి రాకపోవడంతో ఆరు కేంద్రాల్లో ఎస్జీటీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. ఒకటి ఉర్దూ విభాగానికి చెందినది కాగా, మిగతా ఐదు తెలుగు విభాగానివి. రాత్రి పొద్దుపోయాక స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు సంబంధించిన మెరిట్ జాబితా కూడా అందింది. గురువారం నుంచి స్కూల్ అసిస్టెంట్ తెలుగు, ఉర్దూ విభాగాల్లో తెలుగు, హిందీ, గణితం, భౌతికశాస్త్రం, సాంఘికశాస్త్రం, వ్యాయామ విద్య అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనున్నారు.

కోర్టు పరిధిలో రెండు విభాగాలు.. : స్పెషల్ ఎడ్యుకేషన్(ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధించే ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లు) ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయ(పీఈటీ) పోస్టులకు సంబంధించిన కేసులు కోర్టు పరిధిలో ఉన్నాయి. ఈ కారణంగా ఈ రెండు విభాగాల అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించలేదు. కోర్టు అనుమతి వచ్చాకే ధ్రువపత్రాలను పరిశీలన చేయనున్నారు. రెండు, మూడు రోజుల్లో అనుమతి వచ్చే అవకాశాలు ఉన్నాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.



పరిశీలన కేంద్రానికి వెళ్లేదారిలో అడ్డంగా ఉన్న బెంచీలతో అభ్యర్థుల ఇబ్బందులు

సకాలంలోనే పూర్తి చేస్తాం..

అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన సకాలంలో పూర్తి చేస్తాం. తొలిరోజే మూడోవంతు ఎస్జీటీ అభ్యర్థులు పరిశీలనకు వచ్చారు. మరో రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుంది. స్కూల్ అసిస్టెంట్ మెరిట్ జాబితా కూడా వచ్చినందున అభ్యర్థులు 5వ తేదీలోగా ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోవాలి.

- రవీందర్, జిల్లా విద్యాధికారి, మహబూబ్‌నగర్



కృష్ణా నది తీరంలో సాగవుతున్న ప్రభుత్వ భూమి

తీరంలో గలీజు

ఎసైన్‌మెంట్ కమిటీ భూముల్లో కొత్తకోణం

న్యూస్‌టుడే-మాగనూరు

కృష్ణా నది తీరంలో దశాబ్దాల క్రితం బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వం ద్వారా సంక్రమించిన అసైన్‌మెంట్ భూములు అన్యాక్రాంతం అయ్యాయి. కృష్ణా, మాగనూరు మండలాల్లో 2140 ఎకరాలు వివిధ సంవత్సరాల్లో లబ్ధిదారులకు పంచారు. పట్టాలు ఇచ్చినా భూమి ఎక్కడుందో చాలామంది లబ్ధిదారులకు చెప్పకపోవడంతో వారంతా ఏళ్లతరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయమై గత నెల 26న 'ఈనాడు'లో 'తీరంలో భూ మాయ' శీర్షికన కథనం రావడంతో యంత్రాంగంలో చలనం వచ్చింది. ఈ క్రమంలో మరో కోణం వెలుగు చూస్తోంది. అప్పట్లో కొందరు పలుకుబడి కలిగిన వ్యక్తులు కొందరు లబ్ధిదారులతో ఏమీ చెప్పకుండా వేలిముద్రలు వేయించి 99 ఏళ్లకు లీజుకు తీసుకున్నట్లు పత్రాలు సృష్టించారు. దశాబ్దాలు గడిచిపోవడంతో కొందరు లబ్ధిదారులు కాలం చేశారు. అసైన్‌మెంట్ భూములు రిజిస్ట్రేషన్ కావని అందరికీ తెలిసిందే. అప్పట్లో కొందరు మధ్యవర్తులు గుట్టుగా ఈ పని చేయించారు.

● కృష్ణా మండలం అయినాపూర్, తంగడిగి, కుసుమర్తి, కాలహళ్లి, గుర్జాల, గుడేబల్లూర్ శివారుల్లోని చాలామేరకు ప్రభుత్వ భూములు ఇతరుల ఆధీనంలో ఉన్నాయి. లబ్ధిదారుల వారసులు కొందరికైతే తమ పేరిట ప్రభుత్వ భూమి ఉందని తెలియదు. ● భూ సంస్కరణ చట్టంలో లొసుగుల ఆధారంగా ఇప్పటికే చాలా మందికి ప్రభుత్వం ద్వారా సంక్రమించిన భూములు ఇతరుల పేరిట మారిపోయాయి. లీజుకు ఇవ్వని మరికొన్ని భూములు కూడా అన్యాక్రాంతం అయ్యాయి. ఉదాహరణకు మురహరిదొడ్డి శివారులో 7 ఎకరాలు ఇతరుల పేరిట మారిపోయింది. అయినాపూర్ పరిధిలో దాదాపు 50 ఎకరాలకు పైగా బడుగు బలహీన వర్గాల పేరిట అలాగే ఉంది. ప్రస్తుతం కాస్తులో వేరేవారు ఉన్నారు. పట్టాదారుల కుటుంబీకులు వలస వెళ్లిపోవడంతో ఈ విషయం వెలుగులోకి రాలేదు.

● ఈ రెండు మండలాల్లో బడుగు, బలహీనవర్గాల లబ్ధిదారులు తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పడానికి బయటకు రావడం లేదు. పెద్దలతో తమకు తలనొప్పి ఎదురవుతుందని భయపడుతున్నారు. అధికార యంత్రాంగం స్పందించి లబ్ధిదారుల పేర్లు మారిన వ్యవహారం, అలాగే 99 ఏళ్ల లీజు సంగతి తేల్చాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించి నోటీసులు ఇస్తాం: కృష్ణా నదీ తీరంలో ప్రభుత్వ అసైన్‌మెంట్ భూముల విషయంలో పూర్తి స్థాయిలో విచారణ చేస్తాం. రికార్డులలో ఉన్న లబ్ధిదారులు కాస్తులో ఉన్నారా లేదా అన్నది ముందు గుర్తించి హైడ్రా తరహాలో నోటీసులు ఇస్తాం. ఈ విషయంలో పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తాం. ఉన్నతాధికారులకు నివేదించాక చర్యలు చేపడతాం.

- దయాకర్‌రెడ్డి, తహసీల్దారు, కృష్ణా

20 గ్రామాలకు నీటి సరఫరా బంద్

మహబూబ్‌నగర్ వ్యవసాయం, న్యూస్‌టుడే : ఇరవై గ్రామాలకు మూడు రోజుల పాటు మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాను నిలిపివేస్తున్నామని జిల్లా మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారి - 44 వేముల స్టేజీ దగ్గర రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నాయని, అక్కడ పైపులు మార్చేందుకు నీటి సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. గురువారం ఉదయం ఆరు గంటల నుంచి నీటి సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. ఈ పని పూర్తి చేయటానికి మూడు రోజులు పడుతుందన్నారు. అడ్డాకుల మండలంలోని 17 గ్రామాలకు, మూసాపేట మండలంలోని కొంరెడ్డిపల్లి, నందిపేట, సంకలమద్ది గ్రామాలకు నీటి సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు రాష్ట్రస్థాయి పోటీలకు అథ్లెట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి అండర్-14, 16, 18, 20 బాల, బాలికల అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే మహబూబ్‌నగర్ జిల్లా అథ్లెట్ల ఎంపికలను గురువారం ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని డీఎస్ఏ మైదానంలో చేపడుతున్నట్లు సంఘం కార్యదర్శి శరత్‌చంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనన, కుల, పదో తరగతి ధ్రువపత్రాలతో కోచ్ ఆనంద్ కుమార్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఈనెల 7, 8 తేదీల్లో వరంగల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గర్భిణులకు అమ్మ కోసం



యాప్‌పై ఏఎన్ఎంలకు శిక్షణ

అమ్మ కోసం రూపొందించిన ప్రత్యేక యాప్

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : గర్భిణుల కోసం తెలంగాణ ప్రభుత్వం 'అమ్మకోసం' అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గర్భిణుల్లో ప్రధానంగా వచ్చే రక్తహీనతతో పాటు రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ వంటి సమస్యలను అరికట్టేందుకు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఎన్ఎంలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. జిల్లాలో రక్తహీనత సమస్యతో బాధపడే వారు ఎంత మంది ఉన్నారు? ఆ సమస్య ఎలా అరికట్టాలి? ఎలాంటి ఆహారం తీసుకోవాలి? అసలు సమస్య రాకుండా ముందస్తుగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై ఏఎన్ఎంలకు శిక్షణ ఇచ్చారు.

గర్భం దాల్చిన మూడు నెలల నుంచి

మహిళ గర్భం దాల్చిన మూడు నెలల నుంచి వైద్య సేవలు అందిస్తారు. ప్రతి నెల గర్భిణి ఆరోగ్య పరిస్థితి, పిండం ఎదుగుదలను పరిశీలిస్తారు. ఎక్కువ ప్రమాదకర స్థాయి పరిస్థితిలో ఎలాంటి వైద్యం అందించాలి, ఎక్కడికి తీసుకెళ్లాలని అంశాలపై ఏఎన్ఎంలకు అవగాహన కల్పిస్తారు. ప్రతినెల నిర్వహించే వైద్య పరీక్షలను ఎప్పటికప్పుడు పరిశీలించి ఏదైన సమస్య ఉంటే వెంటనే నివారణ కోసం వైద్యులను సంప్రదిస్తారు. గర్భిణులు మధుమేహం బాధితులుంటే.. బిడ్డకు సోకకుండా వైద్యుల సూచనతో మందులు అందించడం, ఎలాంటి ఆహార నియమాలు పాటించాలో అవగాహన కల్పిస్తారు.

క్విజ్ పోటీలు

అమ్మకోసం యాప్ ద్వారా రోజూ ఏఎన్ఎంలకు చరవాణిలో దృశ్య, శ్రవణం ద్వారా గర్భిణులకు అందించే వైద్య సేవలపై వివరిస్తారు. ప్రధానంగా గర్భిణుల్లో వచ్చే రక్తహీనతను సకాలంలో గుర్తించి ముందే నివారణ చర్యలు తీసుకుంటే కాన్పు సమయంలో ఎదురయ్యే ఎక్కువ ప్రమాదస్థాయి (హైరిస్క్)ని తగ్గించేందుకు అవకాశం ఉంటుంది. ఏఎన్ఎంలు విని, నేర్చుకున్న అంశాలపై వారి సామర్థ్యాన్ని పరీక్షించేందుకు ఆన్‌లైన్‌లోనే వారికి క్విజ్ పోటీలు నిర్వహిస్తారు.

ప్రమాదస్థాయి తగ్గించేందుకే..

గర్భిణుల్లో రక్తహీనతను ముందస్తుగా గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటే కాన్పు సమయంలో ఎలాంటి నష్టం జరగకుండా చూసుకోవడానికి అవకాశం ఉంటుంది. ప్రమాదకర పరిస్థితులుంటే మాతాశిశు సంక్షరణ కేంద్రాలకు తీసుకెళ్లి వైద్య సేవలందిస్తాం. ప్రతి మూడు నెలలకు వైద్య పరీక్షలు నిర్వహించి పిండం ఎదుగుదల, ఆరోగ్య సమస్యలుంటే గుర్తించి ముందస్తుగా నివారణ చర్యలు తీసుకుంటాం.

- డి.ఝాన్సీ, జిల్లా మాతాశిశు సంరక్షణ కార్యక్రమ అధికారిణి

నవోదయలో ప్రవేశాలకు తరుణమిదే



నవోదయ విద్యాలయం ముఖద్వారం

బిజినేపల్లి, న్యూస్‌టుడే: కార్పొరేట్ పాఠశాలకు దీటుగా అత్యున్నత ప్రమాణాలతో విద్యనందిస్తూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తోంది వట్టెం నవోదయ విద్యాలయం. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెంలో 1994లో దీనిని ప్రారంభించారు. నాటి నుంచి వేలాది మందిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది వారు ఎంచుకున్న రంగాల్లో స్థిర పడేందుకు దోహదపడింది. నూతన ప్రవేశాలకు ప్రకటన వెలువడిన నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

● ఈ విద్యాలయంలో చదువుతోపాటు విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా క్రీడలు, చిత్రలేఖనం, సంగీతం, యోగా, కరాటే వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. చిన్నతనం నుంచే క్రమశిక్షణ, దేశభక్తి, సేవా భావం అలవాటు పడేలా ఎన్‌సీసీని నిర్వహిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతోంది. ప్రతిష్ఠాత్మక ఐఐటీ, ట్రిపుల్ ఐటీ వంటి విద్యా సంస్థల్లో ప్రవేశాలు పొందేలా సన్నద్ధం చేస్తోంది.

మిగులు సీట్ల భర్తీ

2025-26లో మిగులు సీట్ల భర్తీకి ప్రకటన వెలువడింది. 9వ తరగతిలో చేరేందుకు ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 01.05.2010 నుంచి 31.07.2012 మధ్య జన్మించి ఉండాలి. ఇంటర్‌లో చేరే విద్యార్థులు ప్రస్తుతం పదోతరగతి చదువుతూ 01.06.2008 నుంచి 31.07.2010 మధ్య జన్మించిన వారై ఉండాలి. విద్యార్థులు అక్టోబరు 30 లోగా విద్యాలయ వెబ్‌సైట్‌లో దరఖాస్తు పూర్తి చేయాలి. రాత పరీక్ష ఫిబ్రవరి 08 2025న నిర్వహిస్తారు.

ఎంపిక విధానం ఇలా..

నవోదయ విద్యాలయం ఏటా ఆరో తరగతిలో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. విద్యార్థులు 01.05.2013 నుంచి 31.07.2015 మధ్య జన్మించి ఉండాలి. మొత్తం 80 సీట్లకు 75 శాతం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, 25 శాతం సీట్లు పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తారు. మొత్తం సీట్లలో జనరల్‌కు 37, ఓబీసీలకు 22, ఎస్సీలకు 12, ఎస్టీలకు 6, దివ్యాంగులకు 3 సీట్లు కేటాయిస్తారు. ప్రతి కేటగిరిలోనూ బాలికలకు 33 శాతం రిజర్వేషన్ ఉంటుంది. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేది: 07 అక్టోబరు 2024. 18 జనవరి 2025 ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.

● విద్యాలయంలో ప్రవేశాలు మెరిట్ ప్రకారమే ఉంటాయి. ప్రవేశాల కోసం దళారులను ఆశ్రయించవద్దు. అభ్యర్థి సామర్థ్యాన్ని బట్టి సీబీఎస్ఈ ద్వారా ఎంపిక ఉంటుంది. ఎవరైనా సీటు ఇప్పిస్తామని మభ్యపెడితే ఫిర్యాదు చేయాలి.

- భాస్కర్‌కుమార్, ప్రిన్సిపల్ నవోదయ విద్యాలయ సమితి.

అమ్మవారి క్షేత్రాల్లో ఆధ్యాత్మిక శోభ



విద్యుత్తు దీపాల అలంకరణలో ఐదో శక్తిపీఠం అలంపూర్ జోగులాంబ అమ్మవారి దేవాలయం

న్యూస్‌టుడే, అలంపూర్, మహబూబ్‌నగర్ సాంస్కృతికం

దేవీ నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించేందుకు ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. ఆలయాల్లో శైవ సంప్రదాయంలో దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు, వైష్ణవ సంప్రదాయంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఇదే మాసంలో నిర్వహిస్తారు. కొత్తగా పెళ్లయిన ఆడబిడ్డలు పుట్టింటికి చేరుకుంటారు. ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ పండగ నిర్వహిస్తారు. రకరకాల పిండివంటలు చేసుకుంటారు. ఊరూరా నెల కొల్పే దుర్గామాత విగ్రహాల వద్ద కోలాటాలు, బతుకమ్మ ఆటలతో సాంస్కృతిక శోభ ఉట్టిపడనుంది. పాండవులు జమ్మిచెట్టు మీద దాచిన ఆయుధాలను తీసుకుని యుద్ధం చేసి శత్రువులను ఓడించిన వృత్తాంతాన్ని గుర్తుచేసుకుంటూ దసరా రోజు సాయంత్రం వేళ ప్రజలు జమ్మిచెట్టుకు పూజలు చేస్తారు. అనంతరం శమీపత్రాలను తల్లిదండ్రులు, పెద్దలకు సమర్పించి వారి ఆశీర్వాదం తీసుకుంటారు. పలు చోట్ల రావణ దహనం కార్యక్రమం చేపడతారు. మన్యంకొండ శ్రీవేంకటేశ్వరస్వామి, చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తిస్వామి, బీచుపల్లి ఆంజనేయస్వామి, మద్దిమడుగులోని ఆంజనేయస్వామి, పాలెం, కోస్గిలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో వైష్ణవ సంప్రదాయం ప్రకారం వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తారు.

శక్తిపీఠంలో వైభవంగా ఉత్సవాలు



రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ శ్రీజోగులాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. భారీగా తరలివచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించటంతో ప్రత్యేక శోభ సంతరించుకుంది. నవరాత్రుల్లో అమ్మవారు శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంటాదేవి, కూష్మాండదేవి, స్కందమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిదాత్రిగా ప్రత్యేక దర్శనమిస్తారు. గురువారం సాయంత్రం 6 గంటలకు ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభిస్తారు. రోజూ త్రిశతి, ఖడ్గమాల అర్చనలు నిర్వహిస్తారు. ప్రత్యేకంగా కుమారి, సువాసిని పూజ నిర్వహిస్తారు. ఆలయ ప్రధాన అర్చకులు డిండిగల్ ఆనంద్‌శర్మ అర్చక బృందం ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, హారతితో పూజలు ప్రారంభించి రాత్రి 8.30 గంటల వరకు నిర్వహిస్తారు. సహస్ర నామార్చన, నవవర్ణ అర్చన, తర్వాత చండీ హోమం ఉంటాయి. 9న ఉదయం 10 గంటలకు మూలానక్షత్ర శుభ సమయమున జోగులాంబ అమ్మవారు, బాల బ్రహ్మేశ్వరస్వామి వారి కల్యాణం, సాయంత్రం 4 గంటలకు సింహవాహన సేవ, 10న దుర్గాష్టమి సందర్భంగా ఉదయం 10 గంటలకు రథోత్సవం, 11న మహార్నవమి పురస్కరించుకుని కాళరాత్రి పూజ నిర్వహిస్తారు. 12న విజయదశమి రోజు ఉదయం 8 గంటలకు మహాపూర్ణాహుతి, సాయంత్రం 4 గంటలకు శమీపూజ, 6.30 గంటలకు నదీహారతులు, జోగులాంబ అమ్మవారు, శ్రీబాలబ్రహ్మేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను హంసవాహనంలో ఆసీనులను చేసి తుంగభద్ర నదిలో తెప్పోత్సవాన్ని కనుల పండువగా నిర్వహిస్తారు. ఈ వేడుకలో సుమారు 15 వేలమంది వరకు భక్తులు పాల్గొంటారని ఆలయం ఈవో పురేందర్ తెలిపారు.

ఉత్సవ సమయంలో అలంపూర్ ఆలయాల్లో ఆర్జిత సేవలు

ఆర్జిత సేవ	సమయం	రుసుము(రూ.ల్లో)
సహస్రనామార్చన	ఉ॥ 7.30 నుంచి సా॥ 6 వరకు	1,000
శ్రీచక్ర నవావరణ అర్చన	ఉ॥ 9 గంటలకు	500
త్రిశతి అర్చన	ఉ॥ 8 నుంచి 11.30	500
ఖడ్గమాల అర్చన	మ॥ 2 నుంచి సా॥ 4 వరకు	300
చండీహోమం	ఉ॥ 10 గంటలకు	1,000
రథోత్సవం	సా॥ 6.30 గంటలకు	1,000
కొలువు పూజ, దర్బారు సేవ, సువాసిని, కుమారి పూజలు	సా॥ 7 గంటలకు	300
సామూహిక కుంకుమార్చన	మధ్యాహ్నం 2.30 నుంచి 3.30	ఉచితం
ఉదయాస్తమయ సేవ		3,000

(త్రిశతి, ఖడ్గమాల అర్చనలు కుంకుమార్చన మండపంలో నిర్వహిస్తారు)



విద్యుత్తు దీపకాంతుల్లో మహబూబ్‌నగర్‌లోని రేణుక ఎల్లమ్మ దేవాలయం

ఎల్లమ్మ ఆలయంలో సందడి

మహబూబ్‌నగర్‌లోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. దేవాలయాన్ని సుందరంగా అలంకరించారు. రోజూ తెల్లవారుజామున 4 గంటల నుంచి మూలవిరాట్టుకు అభిషేకంతో పూజలు ప్రారంభిస్తారు. అలంకరణ, కుంకుమార్చన మహానివేదన తర్వాత భక్తుల దర్శనాలు ప్రారంభమవుతాయి. అమ్మవారిని 3న బాలత్రిపుర సుందరి, 4న లక్ష్మీదేవి, 5న గాయత్రీదేవి, 6న వనదుర్గాదేవి, 7న అన్నపూర్ణాదేవి, 8న శాకంబరిదేవి, 9న సరస్వతీ దేవిగా అలంకరిస్తారు. 10న కాళికాదేవిగా నిమ్మకాయలు, గుమ్మడికాయలతో అలంకరణ చేసి కుంభం పోస్తారు. 11న దుర్గాదేవి 12న రేణుకాఎల్లమ్మగా అలంకరించి ఆలయ వద్ద ఉన్న జమ్మిచెట్టుకు పూజ చేస్తారు. స్థానిక అంబాభవాని, కాళికాదేవి, మహబూబ్‌నగర్, జడ్చర్లలోని వాసవీమాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



అలంపూర్ ఆలయ స్వాగత తోరణం

ఇలవేల్పుగా జములమ్మకు పూజలు



ముస్తాబైన జములమ్మ దేవత ఆలయం

గద్వాల కలెక్టరేట్ : గద్వాల సమీప జమ్మిచేడులో వెలసిన జములమ్మ ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రతివారం మంగళ, శుక్రవారాల్లో 10వేల వరకు భక్తులు దర్శించుకుంటారు. కలశస్థాపనతో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభిస్తారు. రోజూ ఉదయం 8 గంటలకు విశేష ఫలపంచామృతాభిషేకం, అలంకరణ పూజలుంటాయి. తొమ్మిది రోజుల్లో మహాలక్ష్మీదేవి, గజలక్ష్మి, అన్నపూర్ణదేవి, శాకాంబరిదేవి, పార్వతి, ధనలక్ష్మి సరస్వతీమాత, దుర్గాదేవి, మహిషాసురమర్ధినిగా దర్శనమిస్తారు. చివరిరోజు జములమ్మ నిజరూపంలో దర్శనమిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు కోనేరులో తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు.

అడవి మధ్యలో కొలువైన మైసమ్మ



నవాబుపేట మండలం కాకర్లపాడు పరిధి అటవీ ప్రాంతంలో వెలసిన ఫతేపూర్ మైసమ్మ దేవత భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్నారు. ప్రతి ఆది, మంగళవారాల్లో వేలాది భక్తులు దర్శించుకుంటారు. శరన్నవరాత్రుల్లో కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వస్తారని ఆలయ అధికారి మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు. నవరాత్రులను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మొదటిరోజు గణపతిపూజ, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, చక్రపూజ కైంకర్యాలతో అమ్మవారిని పూజిస్తారు. నవరాత్రుల్లో మూలవిరాట్టుకు రోజుకో అలంకరణ చేసి ఆరాధించనున్నట్లు ప్రధాన అర్చకుడు శ్రీకాంత్‌శర్మ తెలిపారు.

ఐదుగురు సంతానమున్నా..
అనాథలుగా తల్లిదండ్రులు



ఆకలి తీరుస్తున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు

కాటేదాన్, న్యూస్‌టుడే: కన్నబిడ్డలు ఐదుగురు ఉన్నా ఆ తల్లిదండ్రులను అక్కున చేర్చుకోలేదు. వారికి దూరంగా జీవించాల్సిన దుస్థితి. మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండ మండలం మాసన్‌పల్లికి చెందిన వెంకటయ్య, నరసమ్మ దంపతులు రెండు వారాల క్రితం రాజేంద్రనగర్ చేరుకున్నారు. గగన్‌పహాడ్.. బెంగళూరు జాతీయరహదారిలోని అండర్ పాస్ కింద తలదాచుకుంటున్నారు. ఆ వృద్ధ జంటను రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు ఆదుకుని ఆకలి తీరుస్తున్నారు. బుధవారం 'న్యూస్‌టుడే' వారిని పలకరించగా.. 'మాకు నలుగురు ఆడపిల్లలు, ఒక కుమారుడు. ఆడపిల్లలకు వారి సమస్యలు వారికుంటాయి...కొడుకు మమ్మల్ని నిర్లక్ష్యం చేస్తున్నాడు. భిక్షాటన చేసుకుంటున్నాం. అటు కొడుకు, ఇటు కూతుళ్లు ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు పవనదీప్ మమ్మల్ని ఈ విషయం అడుగుతున్నారు. వారిని బిడ్డాల చేయలేక ఇలా వచ్చాం. పోలీసులు మా కడుపు నింపుతున్నారు. మా పిల్లల ఫోన్ నెంబర్లు తీసుకుని వారితో మాట్లాడించేందుకు ప్రయత్నిస్తున్నా స్పందన లేదు. మేము పనిచేసే స్థితిలో లేం.. ఏమి చేయాలో అర్థం కావడం లేదు' అంటూ కన్నీళ్లపర్యంతమయ్యారు. ట్రాఫిక్ ఎస్సై రాజేందర్ మాట్లాడుతూ వారి పిల్లలతో మాట్లాడి తీసుకెళ్లేలా చూస్తాం.. అలా అవకాశం లేని పక్షంలో ఉన్నతాధికారులతో చర్చించి ఏదైనా వృద్ధాశ్రమంలో చేర్పించేందుకు చొరవ తీసుకుంటామని చెప్పారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు



మల్దకల్, న్యూస్‌టుడే: అమావాస్య సందర్భంగా మల్దకల్ ఆదిశిలాక్షేత్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, గోపూజ, శాంతిహోమం, పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామావళి, పుష్పార్చన, అలంకరణ, మహామంగళహారతి సాయంత్రం పల్లకీసేవ, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. ఈవో సత్యచంద్రారెడ్డి, ఛైర్మన్ ప్రహ్లాదరావు పాల్గొన్నారు.

ఆదిశిలావాసుడి మూలవిరాట్

బాగుపడిన పుష్కరఘాట్



ఈనాడు కథనానికి స్పందన

జోగులాంబ ఆలయ పుష్కరఘాట్ దుర్భరంగా ఉన్న పరిస్థితిపై సెప్టెంబరు 30వ తేదీన 'పుణ్యస్నానాలు చేసేదెలా' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీంతో ఆలయ అధికారులు స్పందించి ఘాట్‌లోని చెత్తాచెదారం తొలగించారు. పిండ ప్రదానం చేసేందుకు ప్రత్యేకంగా ఒక వైపు టెంట్ ఏర్పాటు చేశారు. అటు వైపు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

-న్యూస్‌టుడే, అలంపూర్

చెరువులో పడి యువకుడి మృతి



శ్రీకాంత్

మద్దూరు, న్యూస్‌టుడే: మద్దూరు మండలం చెన్నరెడ్డిపల్లిలో చెరువులోపడి యువకుడు మృతిచెందాడు. గ్రామానికి చెందిన సాయిలు, మొగులమ్మ దంపతుల కుమారుడు శ్రీకాంత్(20) బుధవారం ఉదయం స్నానం చేయడానికి స్నేహితులతో కలిసి చెరువుకు వెళ్లాడు. స్నానం చేస్తుండగా అదుపు తప్పి చెరువులో మునిగిపోయాడు. ఈత రాకపోవడంతో బయటపడలేకపోయాడు. స్నేహితులు బయటకు తీసేసరికి అప్పటికే శ్రీకాంత్ మరణించాడు.

చికిత్స పొందుతూ క్షతగాత్రుడు..

భూత్పూర్, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. 25 - 30 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం ద్విచక్రవాహనంపై బిజినేపల్లి మార్గంలో వెళ్తుండగా వెల్కిచర్ల పెట్రోల్ బంకు నుంచి బయటకు వచ్చిన కారు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి, తర్వాత హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి వద్ద లభించిన ద్విచక్రవాహనం భూత్పూర్ పురపాలిక గోప్లాపూర్‌కు చెందినది గుర్తించారు. ఈ వాహనం చోరీకి గురైందని దాని యజమాని ఇప్పటికే ఠాణాలో ఫిర్యాదు చేశారు. వ్యక్తి మృతికి కారణమైన కారును ఠాణాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, సంబంధితులు ఉంటే మృతదేహం కోసం తమను సంప్రదించాలని ఎస్సై చంద్రశేఖర్ కోరారు.

రైలు ఢీకొని ఒకరి దుర్మరణం

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం పాలైన చెందిన ఘటన మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్ కథనం.. మహబూబ్‌నగర్ పట్టణం తిరుమలదేవుని గుట్ట (టీడీగుట్ట) రైల్వే గేటు వద్ద రైలు పట్టాల సమీపంలో సుమారు 35 ఏళ్లున్న గుర్తుతెలియని వ్యక్తి బహిర్భూమికి వెళ్లగా రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. మృతుడి జేబులో ద్విచక్రవాహనం తాళం చెవి ఉండటంతో సమీపంలోని అన్ని ప్రదేశాల్లో వాహనం కోసం వెతికినా లభించలేదు. సంబంధితులు ఎవరైనా ఉంటే మృతదేహం కోసం రైల్వే పోలీసులను సంప్రదించాలని రైల్వే ఎస్సై కోరారు.

అప్పుల బాధతో యువకుడి బలవన్మరణం

జడ్చర్ల, న్యూస్‌టుడే : అప్పుల బాధతో ఉరేసుకుని యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన జడ్చర్ల మండలంలో వెలుగు చూసింది. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. పోలేపల్లి గ్రామానికి చెందిన మిద్దె గణేశ్(18) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. తల్లిదండ్రులు చనిపోవడంతో పెద్ద అక్క వద్ద మరో సోదరి, ఆయన ఉంటున్నారు. వివిధ అవసరాల కోసం చేసిన అప్పులు పెరిగాయి. ఈ నెల 1న తెలిసిన వారి వద్ద అప్పు తీసుకునేందుకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబానికి చెందిన పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని గ్రామస్థులు బుధవారం ఉదయం గుర్తించారు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు అక్క నీలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

సమాజంలో మార్పు అవసరం

● శివార్చక విజయకుమార్
● అలంపూర్‌లో బాపూ సత్యశోధన పాదయాత్ర ప్రారంభం



అలంపూర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర

అలంపూర్, న్యూస్‌టుడే: ప్రస్తుత సమాజంలో మార్పు అవసరమని విశ్రాంత డీఈవో శివార్చక విజయకుమార్ పేర్కొన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్‌ల ఆధ్వర్యంలో బుధవారం అలంపూర్ ఆలయాల నుంచి ఆయన సారథ్యంలో బాపూ సత్యశోధన పాదయాత్రను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పిల్లలు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేలా చైతన్యపరచడమే యాత్ర ఉద్దేశమని వివరించారు. పిల్లలే దేశ భవిష్యత్తని, వారిని వ్యసనాలకు దూరంగా క్రమశిక్షణతో ఉంచాల్సిన బాధ్యత పెద్దలదేనని ఆయన పేర్కొన్నారు. గాంధీ సిద్ధాంతాలు పిల్లలకు నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. పాదయాత్ర పట్టణంలోని వివిధ కాలనీల్లో కొనసాగించారు. గురువారం ఉదయం అలంపూర్ పట్టణం నుంచి ఉండవల్లికి పాదయాత్ర సాగుతుంది. 100 రోజుల పాటు వెయ్యి కిలోమీటర్లు సాగిన అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని ఉమామహేశ్వర ఆలయం వద్ద వచ్చే జనవరి 12న ముగుస్తుంది. కన్యకా పరమేశ్వరి అన్నదాన సత్రంలో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. జిల్లా పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి బి.ఎన్.వేణుగోపాల్, వెంకట్రామయ్యశెట్టి, ఎన్‌పీపీ సంస్థ నాగేంద్రస్వామి, కల్యాకర్ చంద్రశేఖర్, మాధవరెడ్డి, కృష్ణుడు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు



మైదానాన్ని చదును చేయిస్తున్న అధికారులు

ధన్వాడ, న్యూస్‌టుడే : స్థానిక అప్పాజీ మైదానంలో గురువారం నుంచి 68వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) బాలికల రెజ్లింగ్(కుస్తీ) పోటీలను నిర్వహిస్తున్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు సారథ్యంలో పీడీలు రవికుమార్, సాయినాథ్, బాల్‌రాజు, రామకృష్ణ, కోచ్ శ్రీనివాస్ ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. మట్టిపోసి మైదానాన్ని సమాంతరంగా చేస్తున్నారు. అండర్ 14, 17, 19 ఏళ్ల విభాగాలలో పోటీలు జరుగుతాయి. పాత జిల్లాలవారీగా జట్లు పోటీలకు వస్తున్నాయి. .క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యం కల్పిస్తున్నారు.

ఒకరికి బదులుగా మరొకరిపై వేటు
కానిస్టేబుల్ సస్పెన్షన్‌లో తప్పు సరిదిద్దుకున్న పోలీసు శాఖ

కందనూలు, న్యూస్‌టుడే: ఒంటరిగా ఉన్న జంటల చిత్రాలు తీసి డబ్బులు వసూళ్లకు పాల్పడిన ఇద్దరు కానిస్టేబుళ్లు రామచందర్, చిన్నాను ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ సెప్టెంబరు 25న సస్పెండ్ చేశారు. కానిస్టేబుళ్ల సస్పెన్షన్‌లో మరో కీలక మలుపు తిరిగింది. నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఠాణాలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ చిన్నా స్థానంలో రామును సస్పెండ్ చేయాల్సి ఉండగా అధికారులు పొరపాటున ఇదే ఠాణాలో పని చేస్తున్న చిన్నాను సస్పెండ్ చేశారు. ఎలాంటి కారణం లేకుండా సస్పెండ్ చేయడంతో బాధితుడు చిన్నా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి వివరాలు అందజేశారు. ఎస్పీ ఆదేశాల ప్రకారం బుధవారం సర్కిల్ కార్యాలయంలో సీఐ కనకయ్య ఆధ్వర్యంలో మరోసారి విచారణ నిర్వహించి పూర్తి నివేదికను ఎస్పీకి అందజేశారు. ఎస్పీ ఉత్తర్వుల ప్రకారం కానిస్టేబుల్ రామును విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు సీఐ తెలిపారు. కానిస్టేబుల్ చిన్నాకు పట్టణంలోని ఠాణాలో పోస్టింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

రూ.50 లక్షలు ఇవ్వాలంటూ.. నక్సలైట్ పేరుతో బెదిరింపు

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే : తను నక్సలైట్ అని.. రూ.50 లక్షలు ఇవ్వాలని.. లేదంటే చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేశ్‌గౌడ్ బుధవారం తెలిపారు. వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలం సోళీపురం గ్రామానికి చెందిన తేనేటి శేఖర్‌రెడ్డి జిల్లా రైస్‌మిల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నారు. మంగళవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఓ కొత్త నంబరు నుంచి ఆయన చరవాణికి ఫోన్ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తన పేరు సుదర్శన్ రెడ్డి, నక్సలైట్ అని చెప్పారు. వెంటనే రూ.50 లక్షలు ఇవ్వాలని లేదంటే చంపుతానని బెదిరించారు. దీంతో బాధితుడు ఎస్పీ రావుల గిరిధర్‌కు చరవాణి ద్వారా సమాచారం అందించారు. ఎస్సై సురేశ్‌గౌడ్ మంగళవారం రాత్రి ఇద్దరు కానిస్టేబుళ్లతో ఆయనకు భద్రత కల్పించారు. బుధవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	110-00
రిటైల్	132-00
డ్రెస్డ్	191-00
స్కిన్‌లెస్	218-00

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ.10గం. నుంచి మ.1 వరకు

మహబూబ్‌నగర్: 9948145978 | జడ్చర్ల: 8008573899
దేవరకద్ర: 9000031648 | భూత్పూర్: 8008563143

సమస్య : మూసాపేట మండల కేంద్రంలో నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. సమస్యను పరిష్కరించండి. **- సత్యనారాయణ, మూసాపేట**

సమాధానం : మిషన్ భగీరథ నీటిని అందించి ఇబ్బందులు లేకుండా చూస్తాం. **- కృష్ణయ్య, దేవరకద్ర ఎంపీడీవో**

(- న్యూస్‌టుడే, దేవరకద్ర గ్రామీణం)

తెరపై ఈనాడు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: శ్రీనివాస- దేవర, బాలాజీ - దేవర, తిరుమల - దేవర, వెంకటేశ్వర - దేవర, వెంకటాద్రి - దేవర, శ్రీకృష్ణ - మత్తు వదలరా 2

నిస్వార్థ సేవలతో దైవత్వం



చిన్నారుల నృత్య ప్రదర్శన


పుట్టపర్తి, న్యూస్‌టుడే: నిస్వార్థంతో సేవలందిస్తే తప్పక దైవత్వం సిద్ధిస్తుందని, సత్యసాయి మానవాళికి అందించిన సేవ, ప్రేమతత్వాన్ని అలవరుచుకోవాలని చిన్నారులు నృత్య నాటిక ద్వారా సందేశం ఇచ్చారు. సత్యసాయి మహాసమాధి దర్శనార్థం మహబూబ్‌నగర్ జిల్లా భక్తులు పర్తియాత్రతో శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి వచ్చారు. గురువారం సాయికుల్వంత్ మందిరంలో ఉదయం మహాసమాధి చెంత వేదపఠనం పఠించి, సత్యసాయి గీతాలు ఆలపిస్తూ వేడుకలను ప్రారంభించారు. ప్రపంచశాంతిని కాంక్షిస్తూ సత్య సాయి అష్టోత్తర నామాన్ని భక్తిశ్రద్ధలతో పఠించారు. సాయంత్రం బాలవికాస్ చిన్నారులు 'దంత వేదాంతం' నృత్య నాటికను ప్రదర్శించారు. చిన్నారులకు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ వస్త్రాలు అందజేసి అభినందించారు. సత్య సాయి మహాసమాధిని భక్తులు దర్శించుకున్నారు.






మహబూబ్‌నగర్ : డీసీసీ కార్యాలయంలో గాంధీజీ, శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం, చిత్రంలో కొత్వాల్, నాయకులు.. పీయూలో ఆచార్యులు.. క్లాక్‌టవర్ కూడలిలో భాజపా, భారాస నాయకులు

మహాత్ముడి సిద్ధాంతాలు శిరోధార్యం



మహబూబ్‌నగర్ : తెదేపా నేతలు..



జడ్చర్ల : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..




భూత్పూర్‌లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, నేతలు..



మిడ్జిల్ : మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నాయకులు

న్యూస్‌టుడే బృందం : మెరుగైన సమాజ నిర్మాణానికి జాతిపిత మహాత్మాగాంధీ సిద్ధాంతాలే శిరోధార్యమని, వాటిని ముందు తరాలకు అందించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అశోక్ టాకీస్ కూడలిలో ఏర్పాటు చేసిన గాంధీజీ కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. గాంధీజీ కలల సాకారం కోసం మెరుగైన విద్య, పేదలకు ఇళ్ల నిర్మించేందుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు డీసీసీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే యెన్నం పూలమాలలేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర అల్ప సంఖ్యాక వర్గాల ఆర్థిక సహకార సంస్థ అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, పుర అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ గౌడ్, మార్కెట్ అధ్యక్షురాలు బెక్కరి అనిత, నాయకులు వినోద్‌కుమార్, ఎన్పీ వెంకటేశ్, మల్లు నర్సింహారెడ్డి, సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ పీఆర్‌టీయూ నాయకులు మొదటి పట్టణ కూడలిలోని ఉన్నత పాఠశాలలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాలమూరు విశ్వవిద్యాలయంలో గాంధీజీ, మాజీ ప్రధాని శాస్త్రి చిత్రపటాలకు పీజీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రకిరణ్, పరీక్షల నియంత్రణ అధికారి డా.రాజ్‌కుమార్ పూలమాలలేసి నివాళులర్పించారు. క్లాక్‌టవర్ కూడలిలోని గాంధీజీ విగ్రహానికి భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నేతలు కృష్ణవర్ధన్ రెడ్డి, పాండురంగారెడ్డి, అంజయ్య, యాదయ్య, నారాయణయాదవ్ నివాళులర్పించారు. గడియారం కూడలిలోని గాంధీజీ విగ్రహానికి పుర మాజీ ఛైర్మన్ కేసీ నర్సింహులు, ముడా మాజీ ఛైర్మన్ గంజి వెంకన్న, నాయకులు శివరాజ్, గణేశ్, వేద తదితరులు నివాళి అర్పించారు. తెదేపా నాయకులు జయంతి నిర్వహించారు. రాష్ట్ర సనాతన సారథి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఏనుగొండలోని అనాథ శరణాలయానికి రూ.18వేల విలువైన సరకులను అందించారు. జడ్చర్ల పట్టణంలోని గాంధీచౌక్‌లోని, పురపాలిక కార్యాలయ ఆవరణలోని, కస్తూర్బాగాంధీ ఆలయం సమీపంలో, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని గాంధీజీ విగ్రహాలకు నివాళులు అర్పించారు. భూత్పూర్ కూడలిలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, అన్నాసాగర్‌లో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, భూత్పూర్ పుర కార్యాలయంలో అధ్యక్షుడు బస్వరాజుగౌడ్, కమిషనర్ సురేందర్‌రెడ్డి గాంధీజీకి నివాళులర్పించారు. దేవరకద్ర, చిన్నచింతకుంట, కౌకుంట్ల, బాలానగర్, నవాబ్‌పేట, అడ్డాకుల, మూసాపేట, మహమ్మదాబాద్, గండీడ్, కోయిలకొండ తదితర మండలాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.



అన్నాసాగర్‌లో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, నేతలు



మహబూబ్‌నగర్ : నినాదాలు చేస్తున్న ఆల్‌మేవా రాష్ట్ర, జిల్లా నేతలు



బాలానగర్: పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు







నవాబ్‌పేట : కూచూర్‌లో గ్రామస్థులు.. అడ్డాకుల, మూసాపేటలో నేతలు.. మహమ్మదాబాద్ : పీహెచ్‌సీ వద్ద రోగులకు పండ్ల పంపిణీ.. కోయిలకొండ : వివేకానంద కాలనీలో ప్రజాప్రతినిధులు, నాయకులు

తాగునీటి సమస్యపై గ్రామసభలో నిరసన



ధర్మాపూర్ గ్రామసభలో అధికారులతో వాగ్వాదానికి దిగిన తెలుగుగేరి ప్రజలు

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : తమ వీధులకు మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని, సమస్యను గ్రామ పంచాయతీ పట్టించుకోవడం లేదంటూ 5వ వార్డు పరిధిలోకి వచ్చే తెలుగుగేరి ప్రజలు బుధవారం ఖాళీ బిందెలతో గ్రామసభలో నిరసన తెలిపారు. ఈ క్రమంలో కారోబార్‌కు, తెలుగుగేరి ఇళ్ల యజమానులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పంచాయతీ కార్యదర్శి రాధిక ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభకు ఆయా వార్డులకు చెందిన నాయకులు, మాజీ వార్డు సభ్యులు, గ్రామపెద్దలు హాజరయ్యారు. ఖాళీ బిందెలతో వచ్చిన మహిళలు, యువకులు తెలుగుగేరిలో నీటి సమస్యను కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. తెలుగుగేరికి పైభాగంలో ఉన్న 6, 7 వార్డుల్లోకి వచ్చే వీధుల్లోని చాలా మంది ఇళ్లకు మిషన్ భగీరథ పైపులు వేసి వదిలి పెట్టారే తప్పా కుళాయిలు బిగించలేదని చెప్పారు. కుళాయిలు లేని కారణంగా సరఫరా చేసినప్పుడల్లా శుద్ధజలం వృథాగా పోతుండటంతో కింది భాగంలో ఉన్న తమకు సరఫరా కావడం లేదని తెలిపారు. సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. గ్రామ పంచాయతీలో బడ్జెట్ లేని కారణంగా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోలేకపోతున్నామని, మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైతే అదనంగా పైపులైను విస్తరించి బోరు ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని కార్యదర్శి తెలిపారు. కార్యదర్శి సమాధానంతో సంతృప్తి చెందని ఇళ్ల యజమానులు తమ ఇళ్లకు మిషన్ భగీరథ నీటినే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

వాసవీమాత ఆలయంలో శరన్నవరాత్రులు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దసరా శరన్నవరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు గుండా వెంకటేశ్వర్లు వెల్లడించారు. బుధవారం బ్రాహ్మణవాడలోని వాసవీమాత కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడితో పాటు ప్రధాన కార్యదర్శి మిర్యాల వేణుగోపాల్, కోశాధికారి తల్లం నాగరాజు, ప్రధాన అర్చకుడు గొండ్యాల రాఘవేంద్రశర్మ మాట్లాడారు. ఉత్సవాల మొదటిరోజు అమ్మవారి ఆభరణాలు, పట్టువస్త్రాలు, పూజావస్తువులతో ఊరేగింపు ఉంటుందన్నారు. ఉత్సవాల నాలుగోరోజు ఆదివారం రూ. 6,66,66,666లతో శ్రీమహాలక్ష్మీ అవతారంలో అలంకరించనున్నట్లు వెల్లడించారు. 12న వాసవీమాత ఆలయంలో శమీపూజ, మరుసటిరోజు 13న చివరిరోజు నవదుర్గ అవతారాల్లో అమ్మవారిని చూడచక్కగా అలంకరించి పట్టణంలో ఊరేగించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కె.చక్రధర్‌గుప్త, ఎదిర ప్రమోద్, జానకిరాములు, జి.ప్రవీణ్, కె.చంద్రశేఖర్, జి.రాంచంద్రయ్య పాల్గొన్నారు.

బాలానగర్, భూత్పూర్ : దుర్గాదేవి విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు మండపాలు సిద్ధమవుతున్నాయి. బాలానగర్, గుండేడ్, ఉడిత్యాల, గంగాధర్‌పల్లి, పెద్దరేవల్లిలో గురువారం నుంచి అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అమిస్తాపూర్‌లోని శ్రీజ్ఞాన సరస్వతి దేవీ ఆలయాన్ని ఉత్సవాల కోసం ముస్తాబు చేశారు.

ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం : తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను చాటేలా బుధవారం సాయంత్రం మహబూబ్‌నగర్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. వేంకటేశ్వరకాలనీలోని షిర్డీసాయి ఆలయ ప్రాంగణంలో, టీచర్స్‌కాలనీలోని వరసిద్ధి వినాయక మందిరంలో మొదటిరోజు ఎంగిలి పూల బతుకమ్మ ఆడారు.

పంచాయతీలే దేశానికి పట్టుగొమ్మలు : ఎమ్మెల్యే

భూత్పూర్, న్యూస్‌టుడే : పంచాయతీలే దేశానికి పట్టుగొమ్మలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా పోతులమడుగులో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. భారాస ప్రభుత్వ హయాంలో గ్రామాలకు నిధులు విడుదల చేయకుండా, పంచాయతీ వ్యవస్థను బలహీనం చేసిందని ఆరోపించారు. గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పని చేస్తోందన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్, తహసీల్దార్ రహెమాన్, మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచి హర్యానాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఊశన్న, పంచాయతీ కార్యదర్శి కృష్ణకుమారి పాల్గొన్నారు.

కొత్తకేశవులు సేవలు మరవలేనివి



మాజీ ఎమ్మెల్యే కొత్త కేశవులు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

జడ్చర్ల, న్యూస్‌టుడే : జడ్చర్ల మొదటి ఎమ్మెల్యే కొత్తకేశవులు సేవలు మరవలేనివని జడ్చర్ల పురపాలిక ఇన్‌ఛార్జి ఛైర్‌పర్సన్ సారిక అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం కొత్తకేశవులు 120వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. నాయకులు బాద్మి శివకుమార్, కాట్రపల్లి లక్ష్మయ్య, జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ యాదయ్య, కౌన్సిలర్లు మహేశ్, లత, జ్యోతి, చైతన్యచౌహాన్, సతీష్, పుర కమిషనర్ రాజయ్య, కొత్తకేశవులు ట్రస్టు సభ్యులు జవహర్‌బాబు, ప్రకాశ్, విశ్వనాథం, చంద్రయ్య, నర్సింహులు, రాధాకృష్ణ, రాంరెడ్డి పాల్గొన్నారు.

108లో ప్రసవం

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే : కౌకుంట్ల మండలంలోని పేరూర్ గ్రామానికి చెందిన లక్ష్మిని ప్రసవానికి తీసుకెళ్తుండగా దేవరకద్ర సమీపంలో 108 వాహనంలో మగబిడ్డకు జన్మనిచ్చారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని, వారిని జనరల్ ఆసుపత్రికి తరలించామని 108 సిబ్బంది బాలకృష్ణ, విష్ణు తెలిపారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

నవాబ్‌పేట,న్యూస్‌టుడే : ఈనెల 3 నుంచి 5 వరకు నారాయణపేట జిల్లా కోస్గిలో జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నవాబ్‌పేట కస్తూర్బా విద్యాలయం విద్యార్థినులు ఇద్దరు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ మాధవి తెలిపారు. ఇందులో అండర్-17 విభాగంలో పాఠశాలకు చెందిన కావేరి, సావిత్రి ఎంపికైనట్లు చెప్పారు. వీరిని పీఈటీ అర్చన, ఉపాధ్యాయిరాళ్లు, విద్యార్థులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ నియామకాల్లో..

స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం




ధ్రువపత్రాల పరిశీలన కోసం వచ్చిన ఎస్జీటీ అభ్యర్థులు

అచ్చంపేట, న్యూస్‌టుడే: డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల్లో 1:3 నిష్పత్తి ప్రకారం అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన జిల్లా కేంద్రాల్లో కొనసాగుతోంది. ఈ ప్రక్రియ 5న ముగియనుంది. అర్హులను ఎంపిక చేసి హైదరాబాద్‌లో సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు ఆయా జిల్లాలకు చెందిన స్థానిక అభ్యర్థులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. మొత్తం ఖాళీల్లో 95 శాతం స్థానికులతో భర్తీ చేయనున్నారు. మిగతా 5 శాతం ఖాళీలను ఓపెన్ విభాగంలో భర్తీ చేయనున్నారు. ఈ ఖాళీల్లో స్థానిక అభ్యర్థులతో పాటు స్థానికేతరులను మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో 1,131 ఉపాధ్యాయ ఖాళీల భర్తీ కోసం సుమారు 3,399 మంది అభ్యర్థులను 1:3 నిష్పత్తి ప్రకారం ఎంపిక చేసి ధ్రువపత్రాలు పరిశీలిస్తున్నారు.

- ఒకే అభ్యర్థి ఒకటి కన్నా ఎక్కువ ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైతే వారి నుంచి ఆసక్తి ఉన్న పోస్టును ఎంపిక చేసుకునేందుకు అవకాశం కల్పించి రాత పూర్వకంగా లేఖను తీసుకుంటారు. అభ్యర్థి ఎంపిక చేసుకున్న పోస్టును మినహాయించి ఆ అభ్యర్థి ఎంపికైన ఇతర విభాగాల పోస్టుల నుంచి పేరును తొలగించనున్నారు. ఈ విధానం అమలు చేయడం వల్ల ఖాళీలు మిగిలిపోయే అవకాశం లేదు. తర్వాత ఉన్న మెరిట్ అభ్యర్థులతో ఆ ఖాళీలను వెంటనే భర్తీ చేయనున్నారు.
- అభ్యర్థులు సాధించిన మెరిట్‌తోపాటు రోస్టర్ పాయింట్లను పరిగణనలోకి తీసుకొని ఎంపికైన తుది అభ్యర్థుల జాబితాను నోటీస్ బోర్డుపై ప్రకటించనున్నారు. ఈ అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా 9న నియామక పత్రాలు అందజేయనున్నారు.
- జిల్లాల వారీగా ఉపాధ్యాయ ఖాళీల వివరాలను కూడా నోటీస్ బోర్డుపై అందుబాటులో ఉంచుతారు. పాఠశాలలు, సబ్జెక్టులు, మాధ్యమం వారీగా ఖాళీలను ప్రకటిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు పాఠశాలలను కేటాయించే సమయంలో అభ్యర్థి సాధించిన మార్కులను పరిగణనలోకి తీసుకొని ర్యాంకులు కేటాయించి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. అందుబాటులో ఉన్న ఖాళీల ఆధారంగా మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థులు ఎంపిక చేసుకున్న పాఠశాలల్లో వారికి నియామక పత్రాలు అందజేస్తారు. బాలికల పాఠశాలల్లో మహిళా అభ్యర్థులు అందుబాటులో ఉన్నప్పుడు వారితోనే భర్తీ చేయాలన్న నిబంధన పెట్టారు. దసరా సెలవుల తర్వాత కొత్త ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఎంపిక విధానం ఇలా..: ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు అభ్యర్థులు సాధించిన మెరిట్‌తో పాటు రోస్టర్ పాయింట్లను పరిగణనలోకి తీసుకొని ఎంపిక చేయనున్నారు. రాత పరీక్షకు 80 శాతం, టెట్‌కు 20 శాతం మార్కులను పరిగణనలోకి తీసుకున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులకు మాత్రం వంద శాతం మార్కులను రాత పరీక్ష ఆధారంగా పరిగణనలోకి తీసుకుంటారు. ఆయా వర్గాలకు కేటాయించిన రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకొని రోస్టర్ పాయింట్లను నిర్ణయించనున్నారు.



కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం

మెట్టుగడ్డ(మహబూబ్‌నగర్) : కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం మహబూబ్‌నగర్ పట్టణంలో నిర్వహించారు. స్కౌట్ భవనం ఎదుట జిల్లా అధ్యక్షుడు మాణిక్యంరాజు జెండాను ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి ఎం.కురుమయ్య మాట్లాడుతూ ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన అనే లక్ష్యాలతో కేవీపీఎస్ 1998 అక్టోబరు 2న ఏర్పడిందన్నారు. కేవీపీఎస్, వివిధ సంఘాల నాయకులు ఆదివిష్ణు, వేణు, మనోహర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఉద్యోగ ఉపాధి అవకాశాల సాధనకు పోరాటం

మహబూబ్‌నగర్ గ్రామీణం : నిరుద్యోగ యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వాలతో పోరాడాలని అఖిల భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) జిల్లా కన్వీనర్ భానుప్రసాద్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి పేర్కొన్నారు. బుధవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన డీవైఎఫ్‌ఐ ఐదవ మహాసభలో వీరు మాట్లాడారు. డీవైఎఫ్‌ఐ కోకన్వీనర్లు ఆనంద్, నరేష్, శ్రీనునాయక్, విజయ్, సురేష్, సంతోష్, భగవంతు, రాజు పాల్గొన్నారు

ఎంబీ చర్చిలో కుటుంబ ఆశీర్వాద సదస్సు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రధాన ఎంబీ చర్చిలో బుధవారం కుటుంబ ఆశీర్వాద సదస్సు నిర్వహించారు. ఎంబీ చర్చి ఛైర్మన్, రెవ.ఎస్.వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. క్రైస్తవ సంఘ పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, నాయకులు సీజే.బెన్‌హర్, స్టీవెన్, డేవిడ్, ప్రశాంత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదుత్పత్తికి 41,039 క్యూసెక్కుల నీరు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల జలాశయం వద్ద 55,800 క్యూసెక్కుల వరద నీటి ఉద్ధృతి కొనసాగుతున్న పరిస్థితుల్లో విద్యుదుత్పత్తికి 41,039 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 4.158, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 4.400 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత వర్షాకాలం ఎగువన 220.143, దిగువన 195.234 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగింది.

ఉపకులపతిగా అవకాశమివ్వాలి : ఎంఎస్‌ఎఫ్

పాలమూరు, న్యూస్‌టుడే : పాలమూరు విశ్వవిద్యాలయం ఉప కులపతిగా మాదిగ ఆచార్యుడికే అవకాశం కల్పించాలని మాదిగ విద్యార్థి సంఘం పీయూ అధ్యక్షుడు మీసాల గణేశ్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం పీయూలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు త్వరలోనే కొత్త ఉప కులపతులను నియమిస్తున్నారని, అందులో భాగంగానే గురువారం సచివాలయంలో సెర్చ్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఆచార్యుడికే పీయూ పగ్గాలను అప్పగించాలన్నారు. పీయూ ఎంఎస్‌ఎఫ్ సంఘం నాయకులు శ్రీను మాదిగ, రమేశ్ మాదిగ, కిరణ్ మాదిగ, ఆంజనేయులు, హరీష్, రాంబాబు, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సార్వత్రిక విద్య పరీక్షలు

పాలమూరు, న్యూస్‌టుడే: సార్వత్రిక విద్య(ఓపెన్ స్కూల్) పరీక్షలు ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం, మధ్యాహ్నం పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టిక్కెట్లను పంపిణీ చేశామని చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. జిల్లా కేంద్రంలోని షాసాబ్‌గుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 300 మంది, ప్రభుత్వ గాంధీ రోడ్ ఉన్నత పాఠశాలలో 300 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని చెప్పారు. పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి.. జడ్చర్ల, న్యూస్‌టుడే : చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందారు. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. జడ్చర్ల మండలం కొండేడుకు చెందిన జంగయ్య(56) గత నెల 25న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. కల్లుకు బానిసై, మానసిక ఆందోళనతో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

లారీ ఢీకొని గుర్తు తెలియని వృద్ధురాలికి తీవ్రగాయాలు.. జడ్చర్ల, న్యూస్‌టుడే : గుర్తు తెలియని వృద్ధురాలు(60) రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన జాతీయ రహదారి- 44పై జడ్చర్ల కొత్త బస్టాండుకు సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. కర్నూల్ - హైదరాబాద్ మార్గంలో వెళ్తున్న లారీ గుర్తు తెలియని వృద్ధురాలిని ఢీకొట్టడంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వృద్ధురాలిని ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ స్తంభించగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

వాహనం అదుపుతప్పి ఇద్దరికి.. బాలానగర్ : మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై బాలానగర్ నుంచి వెళ్తుండగా మార్గం మధ్యలో అదుపు తప్పి గుంతలో పడ్డారు. ఇద్దరికి తీవ్రగాయాలు కాగా స్థానికులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దాయాదుల ఘర్షణ.. అడ్డాకుల : దాయాదుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు అడ్డాకుల ఎస్సై ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కందూరు గ్రామానికి చెందిన యాదగిరిని గత నెల 30న అతడి చిన్నాన్న రామకృష్ణ దూషించాడు. ఈ విషయమై యాదగిరి రామకృష్ణను ప్రశ్నించగా అతడిపై దాడిచేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు.. అడ్డాకుల : అదనపు కట్నం కోసం భార్యను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు అడ్డాకుల ఎస్సై ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. పొన్నకల్ గ్రామానికి చెందిన రవికుమార్‌కు కందూరు గ్రామానికి చెందిన చెన్నమ్మతో ఇటీవల వివాహమైంది. గత నెల 27న రవికుమార్ భార్య చెన్నమ్మను అదనపు కట్నం తీసుకురావాలని కొట్టాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భూ తగాదాలో ఒకరిపై దాడి.. మహమ్మదాబాద్, న్యూస్‌టుడే : భూతగాదా విషయమై ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన గాధిర్యాల్ శివారులో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. కుల్కచర్ల మండలం పుట్టపాడుకు చెందిన గోపాల్‌కు, అంతారం గ్రామానికి చెందిన వెంకట్‌రాములుకు మధ్య భూతగాదాలు ఉన్నాయి. ఈ విషయమై గొడవ జరగగా గోపాల్‌పై వెంకట్రాములు బీరుసీసాతో దాడిచేశాడు. గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి.. భూత్పూర్, న్యూస్‌టుడే : విద్యుదాఘాతంతో భూత్పూర్ పురపాలిక పరిధిలోని సిద్ధాయిపల్లిలో రెండు గేదెలు మృతి చెందాయి. అమిస్తాపూర్‌కు రేకులపాటి ఆంజనేయులు నీళ్లు తాగించేందుకు పశువులను మైసమ్మ కుంట వద్దకు తీసుకెళ్లారు. అప్పటికే విద్యుత్తు తీగలు తెగి ఉండటాన్ని గుర్తించకపోవడంతో విద్యుదాఘాతంతో రెండు గేదెలు అక్కడికక్కడే మరణించాయి.

TG